# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

### ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో ప్రతి ఇల్లూ సౌర విద్యుత్ తయారు చేసేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.
- సాగరమాల కార్యక్రమం ద్వారా మత్స్యకారులకు న్యాయం చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.
- వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో మహిళల పాత్ర ఎంతో కీలకమని.. జీఎస్టీ తిరుపతి జిల్లా కమిషనర్ సతీష్ ధవలే అన్నారు.
- టి-20 క్రికెట్ ప్రపంచ కప్ లో కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై, జింబాబ్వే జట్టు 23 పరుగుల తేడాతో విజయం సాధించింది.

====================

రాష్ట్రంలో ప్రతి ఇల్లూ సౌర విద్యుత్ తయారు చేసేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. శాసనసభలో ఈరోజు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద నగదు బదిలీ పథకం అయిన పింఛన్ల పంపిణీ కోసం ఏటా 34వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏటా 20వేల రూపాయలు చెల్లిస్తున్నామని, వివక్ష చూపకుండా అందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే మూడేళ్లలో ఉత్తరాంధ్రలో అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తామని, రాయలసీమలోని ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యుత్ చార్జీలు రానున్న మూడేళ్ళలో కూడా పెంచబోమని ముఖ్యమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్…32 సెకన్లు)

====================

సబ్జెక్టు వారీగా విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈరోజు శాసనమండలిలో 'మన బడి మన భవిష్యత్తు' పథకంపై ప్రతిపక్ష ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, టి. కల్పలత, ఎంవీ రామచంద్రారెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి నారా లోకేష్ సమాధానమిస్తూ... ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి అత్యుత్తమ విద్య అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు స్టార్ రేటింగ్ ఇవ్వాలని అధికారులను ఆదేశించామని, 40 శాతం కన్నా తక్కువ ప్రభుత్వ పాఠశాలలు 2 స్టార్ రేటింగ్ కంటే తక్కువగా ఉన్నాయని వివరించారు. స్టార్ రేటింగ్‌లో వెనుకబడిన పాఠశాలల రేటింగ్ పెంచేందుకు తగు చర్యలు తీసుకున్నామని తెలియజేస్తూ...

(వాయిస్…33 సెకన్లు)

====================

వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో మహిళల పాత్ర ఎంతో కీలకమని.. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తిరుపతి జిల్లా కమిషనర్ సతీష్ ధవలే అన్నారు. ఈరోజు తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో న్యూఢిల్లీకి చెందిన

సెంటర్ ఫర్ ఉమెన్స్ డెవలప్మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జీఎస్టీ అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ 2.0లో పన్నుల మార్పులతో ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. అంతేకాకుండా జీఎస్టీ ద్వారా పన్ను వ్యవస్థ సరళీకృతమై, పారదర్శకత పెరిగిందన్నారు. జీఎస్టీని కేవలం పన్ను విధానంగానే కాకుండా కుటుంబ ఖర్చులు, వ్యాపారాలు, మహిళా సాధికారతపై ప్రభావం చూపే సామాజిక-ఆర్థిక మార్పుగా చూడాలని సూచించారు.

====================

విరామం

====================

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రభుత్వం విద్యార్థులకు అవకాశం కల్పించడంతో సుమారు 200 మంది విద్యార్థులు ఈరోజు శాసనసభను సందర్శించి, సభా వ్యవహారాలను తిలకించారు. శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు, ఉప సభాపతి రఘు రామకృష్ణంరాజు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సభ విరామం సమయంలో విద్యార్థులతో మాట్లాడారు. వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. జీవితంలో అత్యున్నత విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంచుకునేందుకు తమకు ఈ అవకాశం ఎంతగానో దోహదపడిందని తెలిపారు.

(వాయిస్…23 సెకన్లు)

====================

ప్రపంచ రేడియో దినోత్సవ వేడుకలను శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు, హర్షవల్లి లైన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ... జన హితాన్ని కోరే వార్తలు అందించే ఏకైక ప్రసార సాధనం రేడియో మాత్రమేనని కొనియాడారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న నేటి పరిస్థితులకు అనుగుణంగా రేడియో మార్పు చెందుతూ సేవలందిస్తోందని అన్నారు. వ్యవసాయ విజ్ఞానాన్ని అన్నదాతలకు అందిస్తూ దేశాభివృద్ధికి రేడియో ఎంతో దోహదపడుతుంది తెలిపారు.

====================

రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఈరోజు ప్రశ్నోత్తరాల కార్యక్రమం కొనసాగుతోంది. పెందుర్తి నియోజకవర్గంలో మినీ జెట్టి నిర్మాణంపై పంచకర్ల రమేశ్ బాబు అడిగిన ప్రశ్నకు వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ... జువలదిన్నె, మచిలీపట్నం వంటి ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాలు తుది దశలో ఉన్నాయని వివరించారు. సాగరమాల కార్యక్రమం ద్వారా మత్స్యకారులకు న్యాయం చేస్తామన్నారు. కాకినాడ ఫిషింగ్ హార్బర్‌ను మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అలాగే.. వితంతు పెన్షన్లపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని సభ్యుల ప్రశ్నకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానమిచ్చారు.

====================

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, రసాయనాలు, ఎరువుల శాఖా మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాతో లోక్ సభ ప్యానల్ స్పీకర్, బాపట్ల పార్లమెంటు సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ ఈరోజు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఎంపీ, కేంద్రమంత్రికి వినతి పత్రాలను అందజేశారు. ఈ వినతులపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

====================

గిరిజన సంక్షేమ వసతి గృహాలలో ప్రాథమిక సౌకర్యాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం 60 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని రాష్ట్ర మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు. ఈరోజు శాసనమండలిలో గిరిజన సంక్షేమ వసతి గృహాలలో సౌకర్యాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. తరగతి గదులు, భవనాలు, సిబ్బంది గృహాల నిర్మాణం, అదనపు డార్మెటరీ పెట్టెల కొనుగోలు కోసం 423 కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు.

====================

టి-20 క్రికెట్ ప్రపంచ కప్ లో భాగంగా ఈరోజు కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై జింబాబ్వే 23 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే జట్టు 20 ఓవర్లలో2 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా జట్టు 19.3 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌట్ అయ్యింది.

====================

ఉపాధి వేతనదారులకు 100 రోజుల పనిదినాలు తప్పని సరిగా కల్పించాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులకు సూచించారు. ఉపాధి పనులు, వాట్సాప్ సేవలు, మహాశివరాత్రి ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కలెక్టర్ ఈరోజు సమీక్షించారు. పనిదినాల కల్పనతో పాటు వేతనాలు కూడా అధికంగా అందేలా చూడాలని అన్నారు. మార్చి లోపల ఉపాధి పనుల లక్ష్యాలను చేరుకోవాలని, శివరాత్రి సందర్భంగా భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించుకునే దేవాలయాల్లో సమర్ధవంతంగా ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు.

====================
====================